# స్టెతోస్కోపు

నామేపల్లి లక్ష్మయ్య



రత్తాలు తోటబావి వేపచెట్టుక్రింద కూర్చొని ఉంది. పదిరోజులనుంచి రత్తాలు మనసుఏమాత్రం బాగులేదు. నమ్మి నానపోసుకుంటే పుచ్చి బుఱ్ఱలై నట్టుంది తన బ్రతుకు. రంగనాథంయిప్పుడసలే కన్పట్టంలేదు.మూడు రోజుల క్రింద కనబడి వినిపించిన మాటలు తనను పిచ్చిదానని చేస్తున్నవి. మళ్ళీమళ్ళీ ఆ మాటలను జ్ఞాపకం చేసుకొని ఎందుకన్నాడో అర్థంకాక సతమతమౌతుంది.పద్దెనిమిదేండ్లరత్తాలు.

దూరంగా పుల్లవారి డొంక దగ్గర జమిందారు లాల్చీ తొడిగి. సలువపంచి కట్టి వడివడిగా నడుస్తున్న రంగనాథంరత్తాలుకు ఎక్కడలేనిఉత్సాహం తెచ్చిపెట్టాడు. దెగ్గరకువచ్చి బావిసరవల మీద నిలుచుని ప్రక్కనేవున్న మిరపతోట చూస్తున్నాడు.

రత్తాలు యిక మాట్లాడతాడేమో అని ఆశగా చూస్తుంది అతనివైపు.

"నే చెప్పిన సంగతి ఏంచేశావు రత్తాలు. ఆ రెండు పేటల గొలుసు, యివ్వాళ యిక్కడకి తెమ్మన్నానే" అంటూ రత్తాలు మొఖం వైపన్నా చూడలేదు.

రత్తాలు మనసు దుఃఖంతో నిండి యిక బయట పడేందుకు యెక్కువ వ్యవధి లేనట్టు కళ్ళల్లో వెలుగులు తళ తళలాడాయి.

"అది నా సొంతం అన్నారుగదా, యింకా నా యిష్టం వున్నది చేయిస్తా, పూలల్లోపెట్టి పూజిస్తా. ఏడు కొండలమీద పెళ్ళి చేసుకుంట, నా మాట నమ్ము అని చేతిలో చేయి వేశారుగదా" అంటూ వుంటె గొంతు బొంగురు పోయింది రత్తాలుది.

"ఆ రోజులు వేరు, నెమ్మదిగా నే చెప్పినట్టు చేస్తే నీకు నాకు మంచిది. ఇవ్వాళో, రేపో అని మూలుగుతున్న మీ అయ్య పరుపుకాస్తా బజారు పాలు కానీకు. ఏడు జన్మలకవతలగూడ నీకు రాని అదృష్టాన్ని యిప్పుడే వస్తుందని ఆశపడ్డావు. మునెయ్యను కట్టుకొని గుడిసెలోని బ్రతుక్కి దూరంగా మేడల్లో కాపురం చేద్దామని, వాడితో సగం చెడి నా పాల పడిందానివి, యింక వగల ఏడుపుదేనికి. రేపీపాటికి ఆ గొలుసు నాకందివ్వావో నే స్వయంగా యింటికివచ్చి మీ అయ్యను అడగవలసి వస్తుంది." అని గబ గబ అక్కడినుంచి వెళ్ళిపోయాడు రంగనాథం.

రత్తాలు మనసు దుఃఖంతో నిండిపోయింది. చెప్పలేని విచారంతో కుమిలి కమిలిపోయింది. తానుపడ్డ పొరపాటు, పొరపాటని అప్పుడే తెలిస్తే పాపం మునెయ్యనైనా సుఖ పెట్టేదాన్ననిపించింది రత్తాలుకు. రంగనాథం, మునెయ్యల విగ్రహాలు రత్తాలు కండ్లకు లీలగా కన్పించాయి. విషపునవ్వు నవ్వుతూ, కడుపులోని ప్రేమ చేతిలో పెట్టినట్టు నటించి తన శీలాన్ని అపహరించిన రంగనాథం యింత మోసం చేస్తాడని కలలోకూడ ఊహించలేదు. మునెయ్య నిజంగా ఆమె కళ్ళకు ముని లాగా కనిపించాడు. గడిచిన సంవత్సరం రత్తాలు కళ్ళముందు గిర్రున తిరగనారంభించినది.

* * *

కాలువ ప్రక్క చద్దిమూట విప్పిన రత్తాలు ప్రక్కనే మునెయ్యవచ్చి కూచున్నాడు, తన గిన్నెలోని ఉసిరి పచ్చడి రత్తాలుపళ్ళెంలో వేయగానే.

"అదేంటి మావ. ఎంగిలిదేస్తున్నావే" అంది రత్తాలు.

"లేదు రత్తి నే పొద్దిటినుంచి యింకా మూతే యిప్పలేదింక" అన్నాడు మునెయ్య.

అన్నం తినటం పూర్తిచేసిన మునెయ్య. రత్తాలు కంచె క్రిందుగు జరిగి కాలువలోని నీళ్ళు త్రాగాడు. మునెయ్య అమాయకత్వానికి రత్తాలు మొఖం అటు తిప్పుకొని నవ్వుకుంది.

పశువులను గుంటలో తోలి మర్రిచెట్టు నీడన అంతా చేరారు. మునెయ్య, రత్తాలు ఓ డొకరు అటోళ్ళు యిటోళ్ళు కూర్చుని పిచ్చపాటి మొదలు పెట్టారు. యింతలోనే.

"అదేంటి రత్తాలు ఆ పిట్టలట్టా కొట్లాడతావేం, దేనిదెగ్గర నోట్లో ఏంలేదుకదా" అన్నాడు అటు చూస్తూ. రత్తాలు మునెయ్య మొఖం చూసి నవ్వుకుంది.

"అదంతేలే మావ. పుట్టిగనే అట్టా అడుకుంటై" అని చెప్పింది సిగ్గుతో ఎర్రబడ్డ మొగంతో.

మునెయ్య పొద్దున్నే వాళ్ళయ్య తన చెల్లిలి కోసం తెచ్చే బంతిపూలు నాలుగు వళ్ళో వేసుకొని వచ్చేశాడు. ఊరుబయట కనిపించే రత్తాలు చేతిలో పెట్టి "ఎంత పచ్చగా వున్నయో చూడు. ఇటువంటి రంగు కోమటి వెంకటసర్సు దుకాణంలో ఏ గుడ్డ మీద లేదు రత్తి" అనేవాడు.

మునెయ్య, రత్తాలు కలసి గొడ్లను మళ్ళించేవారు. 18 ఏండ్ల రత్తి బొద్దుగా, చామనచాయతో చూచే వాళ్ళకి మరోసారి చూడాలనిపించేటేది. మునెయ్యతండ్రి రామచంద్రం రత్తాలును "కోడలు పిల్లా" అని పిలిచేవాడు. కాలం కలసివస్తే తన కొడుక్కి అడిగి తప్పక ముడిపెట్టాలనుకున్నాడు.

ఆ వూళ్ళో కొత్తగా ఆసుపత్రి తెరిచాడు డాక్టర్ రంగనాథం. రంగనాథం ఎప్పుడు తెల్లటి గుడ్డలే కట్టేవాడు. ఆసుపత్రికి మందులకవి వచ్చేవాళ్ళు గోడలకు వ్రేలాడుతూ కనిపించే బట్టల్లేని సినిమా బొమ్మలు చూసి నవ్వుకునేవాళ్ళు. వచ్చినకొత్తలో అంతగా జరగపోయి నప్పటికి, ఆ చుట్టుప్రక్కల నాలుగు మైళ్ళలోపు సూదులిచ్చే డాక్టరు యితడే కాబట్టి 5, 6 నెలల్లో పరిస్థితి బాగుపడింది. చలాకిగా మాట్లాడేవాడు రంగనాథం. అతనిలో లేని అలవాటు ప్రపంచంలో ఏది లేదు. ఆ వూరి తన లాంటి వాళ్ళు నలుగురితో కలిసి ఒక వయోజన క్లబ్బు తెరిచాడు రంగనాథం.

సాయంపూట డాక్టరు షికారు వెళ్ళేవాడు చేల వైపు. గడ్డిమోపులు ఎత్తుకొని, చద్దిగంపలు తీసికొని ఇంటి ముఖం పట్టిన పల్లెపడుచులను సిగరెట్ పొగ చాటునుండి చూచేవాడు రంగనాథం.

అవేళెందుకో కొంచెం ప్రొద్దుపోయి బయలుదేరాడు డాక్టరు షికారుకు. ఊరి ఏటికాలువ వంతెనమీంచి పశువులు నడుస్తున్నవి డొళ్ళోకి. ప్రక్కకు జరిగి పశువుల వెనక మునెయ్యతో ముచ్చట పెట్టుకుంటు, నవ్వుకుంటు తుళ్ళుకుంటు, వస్తున్న రత్తాల్ని చూశాడు డాక్టరు. తనను దాటి పోయేంతవరకు అక్కడనుంచి కదలలేదు. కన్ను మూత వేయలేదు.

రత్తాలును చూసిన రంగనాథం కళ్ళు అప్పుడే చింతపండేసి తోమి పెట్టిన యిత్తడి గ్లాసుల్లా మిలమిల మెరిశాయి. మందలిస్తే దాగుండనేసిపించింది అతనికి. కాని ఏం మాట్లాడుతాడు.

వారంరోజులుఅలా కాలువవడ్డున వేళకునిలబడి చూడడంతప్ప రత్తాలు గురించి వాకబు చేయలేదు. చేస్తే తన గొప్పతనానికి మచ్చ ఎక్కడ వస్తుందోనని భయం డాక్టరు రోజూ ఏటికాలువ వంతెన వద్ద డ్యూటీ చేస్తూనే వున్నాడు.

రంగనాథానికి రత్తాలు కనపడక యివాల్టికి ఆరు రోజులు, ఏందో కొంచెం వెలితనిపించింది. ఏ పనో చేయలేదనిపించేది రంగనాథానికి.

ఉదయం ఏడు గంటలైంది. టీ గ్లాసు మూతి కందించి. కప్పు పేపరుకొప్పచెప్పిన డాక్టరు తన కళ్ళను తానే నమ్మలేదు. నెమ్మదిగా నడిపించుకొచ్చె ఆ పచ్చబట్ట ముసుగువున్న మొఖంవైపే చూస్తూ వున్నాడు. వెంట వచ్చిన మనిషి "డాక్టరు గారు" అనేవరకు.

"ఆఁ కూర్చోబెట్టండి యీ బెంచిమీద, ఏమిటి సుస్తీ? ఎన్ని రోజులనుంచి ??" అని అడుగుతూ అదరాబాదరా లోనికెళ్ళిన డాక్టరుగారు సిల్కు—

---

* పానకాలరావు అదే మొదటి సారి బొంబాయి వెళ్ళడం. ఓ బస్సు ఎక్కాడు.

కండక్టర్ అందర్నీ టిక్కెట్లు అడుగుతూ వచ్చాడు.

అతనికి ముందుసీట్లో కూర్చుని వున్న యిద్దరమ్మాయిలు

"కలాబాదేవి"

"మహాలక్ష్మి"

అని చెప్పి టిక్కెట్లు పుచ్చుకున్నారు.

కండక్టరు పానకాలరావు వద్దకు వచ్చి ఎక్కడికని అడిగాడు (మరాఠీలో).

"పా న కా లా రా వు" అన్నాడు తడుముకోకుండా....

---

లాల్చీతో మళ్ళీ బయటికొచ్చాడు.

"వారం రోజులైందిబాబు చలిజ్వరం." అంటూ జవాబిచ్చాడు రత్తాలు తండ్రి నాగభూషణం.

వెంటనేలేచి సిరంజిలోకి మందు ఎక్కించి. స్పిరిట్‌దూది మరింతపట్టి మోచేతిదగ్గర ఒక చేత్తో పట్టుకొని. రెండవకను యింకోచేత్తో సున్నితంగా పైకి నెట్టి ఇం జ క్ష న్ యిస్తూ అదో మాదిరిగా భయంగా చూస్తున్న రత్తాలును నవ్వుతూ "ఏం భయంలేదు, రేపటెల్లుండికి తగ్గిపోతుం దొని టేబుల్ వెనక వున్న కుర్చీలో జారగిల పడ్డాడు.

మరుసటిరోజు రత్తాలు మునయ్యతో ఆస్పత్రికి వచ్చింది. డాక్టరుగారు రత్తాలునుచూడగానే అందరి కంటె ముందు దగ్గరకుపిలచాడు. అంతకుముందు ఆసుపత్రిలో ఎవరికి కనిపించని ఓ పాత సెతస్కోపు చెవులకు తగిలించుకొని రత్తాలు ఛాతిమీద, వీపు మీద తిరిగి తిరిగి పరీక్షచేశాడు, మునెయ్యకు అటు వేపు చూడబుద్ధికాలేదు.

"రేపటినుండి నువ్వొక్కత్తే రావచ్చు, కొంచెం నయంగదా ! ఉదయం అంతా జనం, సాయంత్రమైతే నెమ్మదిగా చూడవచ్చు" అని చెప్పి పంపాడు రంగనాథం.

మునెయ్యకు యీ నాలుగు రోజులనుంచి ఏం తోచటంలేదు. తనవెంటవుండి తనతోపాటు తిరిగే రత్తాలు లేకపోవటం చాలా విచారం వేసింది. మునెయ్య మనసు ఏదో తెలియనిబాధతో మూలుగుతూంది. రోజు పశువులను విప్పేముందు ఒక సారి రత్తాలు దగ్గఱకు వెళ్ళివచ్చాడు. సాయంత్రం పని తీరగానే మళ్ళీ ఓ సారిపోయివచ్చేవాడు. గోధుమ పిండికోసం వెదుకులాడే నాగభూషణానికి, నాలుగు మైళ్ళ అవతల వున్న మరో గ్రామానికి వెళ్ళి ఆ రాత్రికిరాత్రే తెచ్చిపెట్టాడు.

బత్తాయిపళ్ళుకావాలని మందు ఎండలో పశువుల దగ్గరవున్న తన వద్దకువచ్చిన నాగభూషణం మావను ఇంటికి పంపి గొడ్లను ఓ పిల్లాడికి అప్ప చెప్పి రాత్రికల్ల పట్నం వెళ్ళి పండ్లుతెచ్చాడు మునెయ్య.

రత్తాలు కొంచెంకోలుకుంది ఇప్పుడు ఒక్కత్తే మందుకెళ్ళి వస్తూంది. డాక్టరుగారు ఇంజక్షన్ యిచ్చేటప్పుడు చేయి పట్టుకొని తన వైపుచూసే ఆ చూపుకు అర్థం ఏమిటో రత్తాలుకు అసలు అర్థం అయ్యేదికాదు. మందు నోట్లోపోసి నాలుగు బొట్లు మీదపడ్డప్పుడు ఆత్రంతో డాక్టరుస్వయంగా రత్తాలు కొంగు మీది మందుచుక్కలు తుడుస్తూ నవ్విన నవ్వుకు జవాబుగా మళ్ళీ నవ్వకుండా వుండలేకపోయింది రత్తాలు. డాక్టరు తొడిగిన బట్టలమీంచి వొచ్చే మత్తైన అత్తరు వాసన రత్తాలు మనసుకు ఏవో ఏవో తియ్యటిభావాలు కలిగించేవి.

ఆ రోజు తాను ఇంటికెళ్ళే ముందు ఓ చిన్న డబ్బాలాంటిది చేతిలో పెట్టి " 'సెంటు', పూసుకో" అన్నాడు డాక్టరు. ఇదేదో కొత్త మందు అనుకుంది రత్తాలు. ఇంటికెళ్ళి మూతతీసే సరికి, ఇల్లంతా గప్పున కమ్మటి వాసనతో నిండిపోయింది. రత్తాలుకు ఆనందంతోపాటు, ఆశ్చర్యంకూడా కలిగాయి. డాక్టరు తన ఎదురురొమ్మున పెట్టి చూసింది ఎంత గొప్పదో యిప్పుడు అర్థమైంది రత్తాలుకు. తన మనసులో వున్నది డాకరుకు ఆ తీగల బిళ్ళే చెప్పివుంటుం దనుకుంది.

ఈ మధ్య రత్తాలు బొత్తిగా మారిపోయింది. పక్కాపాపడ తీసి గట్టిగా కొప్పుకట్టి చలువ చేసిన కోకలు రంగుజాకిట్లు తొడుగుతుంది. మునెయ్యకు రత్తాలు దర్శనమే లేదు. మునెయ్య మూగబాధ అనుభవించాడు. రత్తాలు కనపడకున్నా బాధపడే వాడుకాదు. కాని నిన్న మంచినీళ్ళ బావిదగ్గర కనపడి "ఏం రత్తాలు ఎట్టాగున్నావు?" అని అడిగినపుడు "దాగలేకపోతె సీకెట్ట కనిపిస్తా" నంది మొగం యింకోవైపు తిప్పి.

పశువులను తోలికొచ్చి 'సవిటివాగు కంచె'లో తోలేదేకాని మళ్ళీ కనిపించేదికాదు. ఒకటే రెండు సార్లు కంచెకి దగ్గరలోవున్న పొన్నువారి తోటలో నుండి బయటికి పోతున్న డాక్టరును, అటు తరువాత కొంచెంసేపటిలో మర్రి నీడకు వచ్చే రత్తాలును చూచాడు మునెయ్య. కాని ఏమి అడగలేదు. మాట్లాడలేదు.

పశువులను మేపుకొనే మునెయ్య ఇంటికి రావటం, అడవికి వెళ్ళటం తప్ప రత్తాలు విషయం

అసలు పట్టించుకోవటంలేదు. ఆ ఉదయం. అందరికంటె ముందే పశువులను తోలు కొచ్చి చెట్టునీడన కూర్చున్న మునెయ్యను చూచిన రత్తాలు "ఏం మునెయ్యా. అట్లాగున్నావేం ?" బాగులేదు వంట్లో?" అని అడిగింది నవ్వుతూ.

"మీ డాక్టరు నాకేమందు యియ్యలేదు. ఆమందు లకు పోయె జబ్బేమి నాలో లేదు" అన్నాడు మునెయ్య.

మునెయ్యకు యింత తెలివి ఎక్కడనుంచి వచ్చిందో రత్తాలుకి అంతుపట్టలేదు.

రోజులు గడచిపోతున్నవి. ఆ రోజు దసర. డాక్టరుగారు సాయంత్రం కొత్తబట్టలుకట్టి తొందర తొందరగా వరిమళ్ళ దుగాలపై నడిచిపోతున్నాడు. అతని చూపంత. అంత దూరానవున్న తోటపైనే. వుంది. గున్నమామిడి చేరేసరికి అప్పటికే వచ్చి వున్న రత్తాలు దిగ్గునలేచి సిగ్గుతో చెట్టుచాటుకు వెళ్ళింది. దానికి కారణం ఎప్పుడు కట్టని డాక్టరు తెచ్చిన 'డార్లింగ్' చీర కట్టడమే. డాక్టరు రత్తాలు దగ్గరకుచేరి "రత్తీఎంతఅందంగావున్నావు"అంటూ దగ్గిరకుతీసుకున్నాడు. రత్తాలు కళ్ళు గుండ్రంగా తిప్పుతూ, భుజాలపై చేతులువేసి "మీరేదో కానుక యిస్తానన్నారుగా యియ్యాల" అంటూ కాలి బొటన వేలితో గుండ్రంగా నేలమీద చక్రాలు గీస్తూంది. రంగనాధం చటున జేబులోంచి ఓ పొట్లంతీసి "ఏది కళ్ళు మూసుకో, నీకే తెలుస్తుంది"అన్నాడు.

రత్తాలు కళ్ళుమూసి తెరచేటప్పటికి తన ఎత్తయిన స్తనాలమీద పచ్చగా మెరసిపోయింది. బంగారపు రెండుపేటల గొలుసు. రత్తాలు ఆనం దానికి అవధులు లేవు.

ఆ సాయంత్రం రత్తాలు, రంగనాధం స్వర్గానికి బెత్తడుదాక వెళ్ళి వచ్చారు.

ఆ రాత్రి రత్తాలు పక్కపై పడుకుందిగాని మనసుమాత్రం తిరుపతి కొండమీద తిరుగుతూంది. తానొక పెళ్ళికూతురై డాక్టరుగారి పక్కన చిన్న కారులో కూర్చొని పెళ్ళిమండపంపై పు పోతున్నట్టు, పెళ్ళి జరిగి ఓ పెద్ద బంగ్లాలో కాపురం పెట్టినట్టు కలకంది.

* * *

ఆ కలలన్నీ పాపం యిప్పుడు రత్తాలుకు తీరని కలలు. తన బ్రతుకు రెంటికి చెడ్డ రేవడయింది. తన మొహం తనకే వికారంగా, ఎవరికి చివరకు మునెయ్యకుకూడ చూపించగూడనిదిగా భావించింది. తప్పుచేసే పెద్దమనుష్యులు యీ లోకంలో ఎంత మందిలేరు. కాని రత్తాలువలె పశ్చాత్తాప పడేవాళ్ళు కొంతమందే. ఆ సారి చేసిన తప్పు మొదటిదే కదా అని రెండవదానికి పునాది వేసేవాళ్ళే ఎక్కువ యీ లోకంలో.

చీకటిపడుతుంది. పశువులు ఇంటిమొహం పట్టాయి. తన పశువులతో యింకా వెనకే వుంది. "రావేం రత్తీ" అని కమ్మాళ్ళబ్బాయి అడిగాడు. "నేనింకా నీళ్ళు తాపుకొని వాటి ఒళ్ళు కడిగి తోలుకొస్తా మీరు పదండి" అని సమాధానం చెప్పింది.

తెల్లవారి ఊరు లేచేటప్పటికి ఎవరినోట్లో విన్నా యిదేమాట "పాపం నాగభూషణం దిడ్డ రత్తాలు పశువులను కడగబోయి కరణం పాపయ్యగారి బావిలో కాలుజారి పడిందట" అని.

రత్తాలు వచ్చినందుకు తండ్రి, తల్లి తరువాత ఎవరైనా బాధపడ్డారంటే ఒక్క మునెయ్య తప్ప ఇంకెవరూ లేరు. లోకం 'నిజానికి' దాని 'నిర్మలత్వానికి' విలువ నివ్వదు; యిస్త్రీ దుస్తుల్లో వున్న 'అవినీతిని' దాని పైరంగులుచూసి మోస పోతుంది రత్తాలులా.

★

ఆధునిక కవిత :

# బడిపంతులు

రష్యన్ మూలం :
యూజినీ అలెగ్జాండ్రోవిచ్ : యెతుషెంకో

తెలుగు :
మానేపల్లి సత్యనారాయణ

బడి కిటికీలోంచి చెట్లుకనిపిస్తున్నాయి
బళ్లో పంతులు చెట్లవేపు చూస్తున్నాడు
చాలా సేపటించి చూస్తున్నాడు
చేతులోవున్న సుద్దముక్కని పొడుంచేస్తూ
చెటవేపు చూస్తున్నాడు – చాలా సేపటించీ
ఏమీలేదు – పొడుగు భాగహారం ఎలాచెయ్యాలని?
మర్చిపోయేడు పొడుగుభాగహారం ఎలా చెయ్యాలో
ఊహించుకోండి – పొడుగు భాగహారం
ఎలా చెయ్యాలో మర్చిపోయేడంటే !
నల్లబల్లమీద ఒకతప్పు – ఒక్కతప్పు !
అవన్నీ మనం మరోలాచూస్తాం
ఎవర్నీ ఏమీ చెప్పనివ్వం—
బడిపంతులు పెళ్ళాం లేచిపోయింది
ఆవిడెక్కడికి లేచిపోయిందో మనకితెలీదు
ఆవిడెందుకు లేచిపోయిందో మనకితెలీదు
మనకి తెలిసిందల్లా ఏమిటంటే
బడిపంతులు పెళ్ళాం లేచిపోయిందని !
అతనిబట్టలు కొత్త వీకావు —
కొత్త ఫాషన్‌వీకావు
తొడుక్కున్న దుస్తులే ఎప్పుడూ తొడుక్కుంటాడు
అదయినా కొత్తదీకాదు – కొత్తఫాషన్‌దీకాదు,
పంతులు నింపాదిగా సామానగదిలోకొస్తాడు.
జేబులు గబగబా తడుముకుంటాడు.
బస్సుసీజన్ టిక్కట్‌కోసంగావును,
"బహుశా – నేను టిక్కెట్టు తీసుకుని వుండను
మరయితే ఎక్కడ పెట్టేశాను చెప్మా "అనుకుంటాడు
అనుకుంటూ నుదురుతోముకుంటాడు
"ఓ ! అమ్మయ్య – ఇక్కడేవుంది – అబ్బే
నేను ముసలివాణ్ణయిపోతున్నాను
ఎందుకు మరి చెప్పొద్దు – నేను ముసలయిపోతున్నాను
కాని ఏంచెయ్యడం?"....
అతని వెనక తలుపువేసిన చప్పుడు.

* * *

బడి కిటికీలోంచి చెట్లుకనిపిస్తున్నాయి
ఆ చెట్లుచాలా ఉన్నతంగా వున్నాయి
చాలా అద్భుతంగా వున్నాయి
అయితే మనం వాటివేపు చూట్టంలేదు,
బడిపంతుల్ని చూస్తున్నాం నిశ్శబ్దంగా
అతనినడుం వొంగిపోయింది – కొంకిరినడక –
అతను కదిలే పట్లుండవు
అతనిమీద మంచు కురుస్తూంది
తెల్లగా మంచుతో కప్పబడిన చెట్టులాగ
తెల్లగా మంచుతో కప్పబడిన బడిపంతులు
చెట్లలాగే – ఆ తెలుపుతో తెలుపయిపోతాడు
కాసేపుంటే – అంతా తెలుపే –
ఆ తెల్లటి చెట్లలోంచి అవన్ని మరిచూడలేం.